క్లుప్తంగా

సన్మానం



పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా పదవీ బాధ్యతలను స్వీకరించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆదివారం జహీరాబాదు ఎంపీ సురేష్ షెట్కార్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వ్యవసాయ రంగంలో అపార అనుభవం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సలహాలు ఎంతగానో ఉపయోగపడి రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

శిక్షణ కానిస్టేబుళ్లతో బందోబస్తు



సూచనలిస్తున్న పోలీసు అధికారులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీతో పాటు మండల కేంద్రాలు, పెద్ద గ్రామాల్లో వినాయక నిమజ్జనాల కోసం వివిధ జిల్లాల్లో కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్న దాదాపు 100 మంది యువతీ యువకులను ఖేడ్‌కు పంపారు. బందోబస్తుకు వారితో పాటు డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బందిని వినియోగించనున్నారు. ఖేడ్ సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో వసతిని కల్పించారు. ఆదివారం డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి వినాయక శోభయాత్రలు, చెరువుల వద్ద బందోబస్తులకు సంబంధించిన అంశాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఖేడ్, నాగల్ గిద్ద ఎస్‌ఐలు విద్యాచరణ్‌రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సేవా కార్యక్రమాలు



నారాయణఖేడ్ కస్తూర్బా విద్యాలయంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న మహిళలు

నారాయణఖేడ్: శ్రీసత్యసాయి సేవాసమితి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఖేడ్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, సమీకృత బాలుర వసతిగృహాల్లో సేవాకార్యక్రమాలను నిర్వహించారు. సేవాసమితికి చెందిన మహిళా వలంటీర్లు కస్తూర్బా విద్యాలయంలో, పురుష వలంటీర్లు సమీకృత వసతీగృహంలో తరగతి, వసతి, వంటగదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఆవరణలను శుభ్రం చేశారు. అనంతరం ఆవరణల్లో వివిధ రకాల మొక్కలు నాటారు. మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కస్తూర్బాగాంధీ విద్యాలయ ప్రత్యేక అధికారిణి జ్యోతి రాథోడ్ కృషితో అనేక సదుపాయాలు సమకూరాయన్నారు.

మేధావిని కోల్పోయాం



ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేశం సీతారాం ఏచూరి లాంటి మేధావిని కోల్పోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య తెలిపారు. ఆదివారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో బెల్ సీపీఎం శాఖ కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్ల కేటాయింపు

మునిపల్లి(అందోల్): ఇంటింటికి తిరిగి సంబంధిత అధికారులు ఆధార్‌కార్డులో ఉన్న ఇంటి నంబర్లను వేశారు. ఆదివారం మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఇంటి యజమాని ఆధార్ నంబర్‌లో ఉన్న నంబర్ రాసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇంటి యజమానులు వారి ఆధార్ నంబర్‌లో ఉన్న ఇంటి నంబర్లను రాయించుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఇంటి యజమానులను కోరారు.

హమ్మయ్య.. మా భవనాలు సేఫ్

హైడ్రా కమిషనర్ ప్రకటనతో ఊరట

- అందోల్ పెద్ద చెరువు శివారులోని నివాసుల సంతోషం
- పది రోజులుగా టెన్షన్..టెన్షన్



అందోల్ చెరువు పక్కన నిర్మించిన భవనాలు

జోగిపేట(అందోల్): పట్టణంలోని అందోల్ పెద్ద చెరువును ఆనుకొని నిర్మించిన ఇళ్లు, భవనాలను ఎక్కడ తొలగిస్తారోనని జనం భయ పడ్డారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటనతో వారు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు 350 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువుకు ఆనుకొని 250 ఇళ్లు, భవనాలను 20, 30 ఏళ్ల క్రితం నిర్మించుకున్నారు. ఈ చెరువులో సుమారుగా 260 ఎకరాల వరకు శిఖం భూమి ఉంటుంది. ఇటీవల పట్టణంలోని చెరువు శిఖంలో ఇళ్ల నిర్మాణం జరిగిందని, చర్యలు తీసుకోవాలంటూ సోషల్ మీడియాలో కొందరు పోస్టు పెట్టి వైరల్ చేశారు. దీంతో ఆ ఇళ్లల్లో నివాసం ఉంటున్నవారు కొన్ని రోజుల పాటు కంటికి కునుకు లేకుండా వేదన పడ్డారు. ఇళ్లన్నీ కూలగొడతారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఇంతలోనే హైడ్రా కమిషనర్‌గా దడపుట్టిస్తున్న ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ ఈనెల 8వ తేదీన చేసిన ప్రకటనతో ఆ ప్రాంతంలో ఉంటున్న వారికి ప్రాణం పోసినట్లు అయ్యింది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఏళ్ల క్రితం నిర్మించుకుని నివాసం ఉంటున్న ఇళ్లను కూల్చబోమని, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవి మాత్రమే కూలుస్తామని ప్రకటించారు. దీంతో ఎఫ్‌టీఎల్‌లో భవనాలు, ఇళ్లు ఉన్నవారంతా సంతోషం వ్యక్తం చేశారు. జోగిపేటలో ప్రధాన రహదారిలో సంగారెడ్డి నుంచి మెదక్ వైపు వెళ్లే రహదారిలో మార్కెట్ కమిటీ ఎదుట పెద్ద బంగ్లాలు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. అంతేకాకుండా వ్యాపార, వాణిజ్య సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో స్థానికులు కొందరు వీటిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులు చేశారు. కానీ హైడ్రా కమిషనర్ వారికి అనుకూలంగా ప్రకటన చేయడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. జోగిపేట గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఈ నిర్మాణాలకు అనుమతి లభించింది.

టెన్షన్ పోయింది



అందోల్ పెద్ద చెరువు ప్రాంతంలో నిర్మించుకున్న ఇళ్లు, భవనాలను కూల్చివేస్తారన్న ప్రచారంతో చాలా టెన్షన్ పడ్డాం. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలను కూల్చబోమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటనను విడుదల చేయడంతో ఊపిరి వచ్చినంత పని అయ్యింది. వారం ..పది రోజులుగా చాలా మంది ఆందోళనకు గురయ్యారు. పంచాయతీగా ఉన్న సమయంలో అనుమతి తీసుకునే నిర్మాణాలు చేపట్టిన భవనాలు ఉన్నాయి. ఒకవేళ కూలిస్తే తమ పరిస్థితి ఏమిటన్న భయం మాలో చాలా కలిగింది. భగవంతుడు మమ్మల్ని రక్షించాడు.

– రజినీకాంత్, జోగిపేట

కాంగ్రెస్‌తోనే బీసీలకు సమన్యాయం

– కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



ర్యాలీలో నీలం మధు ముదిరాజ్, నాయకులు

పటాన్‌చెరు: నూతన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. మహేష్‌గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా అసెంబ్లీ గన్‌పార్క్ నుంచి గాంధీభవన్ వరకు జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా నీలం మధు మాట్లాడుతూ... బీసీ బిడ్డకు పెద్ద పీట వేసిని కాంగ్రెస్ అధినాయకత్వానికి రుణపడి ఉంటామన్నారు. అన్నివర్గాలకు సమ ప్రాధాన్యత నిస్తూ ఓట్లతో పాటు రాజకీయ అధికారం సైతం అప్పగిస్తూ అన్ని వర్గాలను ప్రోత్సహిస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని కొనియాడారు. బీసీ కులగణనను త్వరలో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ మంత్రులకు ముఖ్య నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మహేశ్‌గౌడ్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం జరుపుకోవాలని సీఐ మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. ఆదివారం పట్టణంలోని ఎంజీ బంకెట్ హాలులో ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నిమజ్జనంలో డీజేలు ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిర్ణీత సమయానికి విగ్రహాలను గాంధీచౌక్ వద్దకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆకుల శివకుమార్, పవన్‌కుమార్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, మాణిక్‌రావు, సతాని శ్రీశైలం పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో మార్పులు అవసరం



ఇంజనీరింగ్ డేలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

అగ్రికల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రఘురాంరెడ్డి

కంది(సంగారెడ్డి): సాంకేతికత, కొత్త టెక్నాలజీని ఉపయోగించి వ్యవసాయ రంగంలో మార్పులు తెచ్చేందుకు ఇంజనీర్లు కృషి చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురాంరెడ్డి సూచించారు. ఆదివారం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని కందిలోని అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రఘురాంరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో పరిశోధనలు జరుపుతూ రైతులకు మేలు చేసే పద్ధతులను కనుగొనాలన్నారు. ఇంజనీరింగ్ లో భాగమైన కృత్రిమ మేధ, డ్రోన్ టెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 95 అసిస్టెంట్ ఇంజనీర్ల ఎంపికలో కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 78 మంది ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ మనోజ్ కుమార్, రిటైర్డ్ డీన్ సదాశివ్ రావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



తాటిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

మునిపల్లి(అందోల్): చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉందని, అందుకే ప్రతి విద్యార్థి అంకిత భావంతో చదవాలని పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమేళనంలో తాటిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నర్సయ్య అన్నారు. మండలంలోని బుదేరా చౌరస్తా సమీపంలోని తాటిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ నాటి ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, సునీత, కవిత, డ్యానియల్, నాయుడు, తాటిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణపతి బప్పా మోరియా..



జహీరాబాద్ టౌన్: నిమజ్జనానికి తరలివెళ్తున్న రాంనగర్, గాంధీనగర్ వినాయక విగ్రహాలు



న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో పూజలు చేస్తున్న భక్తులు



పటాన్‌చెరు టౌన్: లక్ష్మీగణపతి అలంకరణలో గణేశ్‌గడ్డ గణనాథుడు



సదాశివపేట(సంగారెడ్డి): ఊబ చెరువులో బాలవినాయక విగ్రహాల నిమజ్జనం



నారాయణఖేడ్: వినాయక లడ్డూను దక్కించుకున్న భక్తులు



సంగారెడ్డి టౌన్ : వసంత్ నగర్ కాలనీలోని వినాయక విగ్రహం వద్ద పూజలు

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఎంపీని సన్మానిస్తున్న నిర్వాహకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నర్సింగ్‌గౌడ్ సోదరి ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ వైద్యులు ఆసుపత్రులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

జహీరాబాద్ టౌన్: సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరికి సీపీఎం నాయకులు సంతాపం ప్రకటించారు. పట్టణంలోని శ్రామిక విజ్ఞాన్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంతాప సభలో జిల్లా కార్యదర్శి బి. రాంచందర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాంచందర్ మాట్లాడుతూ దేశానికి ఎనలేని సేవలు అందించారని, విప్లవానికి దిక్సూచిగా ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో నాయకులు, కార్యకర్తలు నడవాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్త వార్తలు

◆ **డిస్పెన్సరీ ఏర్పాటుకు కృషి చేయండి**

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీని ఆరు పడకల ఆస్పత్రిగా గతంలో కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ శంకుస్థాపన చేశారని.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్మించుకోలేక పోయామని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్ అన్నారు. పనులు ప్రారంభించి పూర్తి చేసే విధంగా చూడాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగసాని నరేష్ కుమార్, నాగసాని తులసిదాస్, న్యాయవాది నవీన్‌రాజ్ పాల్గొన్నారు.

◆ **పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా తులసీరాం**

జహీరాబాద్ టౌన్: పీఆర్‌టీయూటీఎస్ జహీరాబాద్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని బంజార భవనంలో పీఆర్‌టీయూ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తులసీరాం రాథోడ్, ప్రధాన కార్యదర్శిగా అశోక్,అసోసియేట్ అధ్యక్షులుగా బాగయ్య, సంగమేశ్వర్, శివనారాయణ, వెంకటేశ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా పి. సంగీత, కార్యదర్శులుగా భాస్కర్, విశ్వనాథ్, మహిళా కార్యదర్శిగా సౌజన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

◆ **ప్రమాణ స్వీకారోత్సవం**

సదాశివపేట(సంగారెడ్డి): ఎడ్ల బజార్ వీరశైవ లింగాయత్ సమాజం అభివృద్ధికి కృషి చేస్తానని అధ్యక్షుడు గందిగరాజు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎడ్ల బజార్ బసవేశ్వర మందిరంలో నూతన వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్ష కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా గందిగరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అన్మిశెట్టి జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా సిందిరికేరీ వినోద్, కోశాధికారి అమ్రాది రాచన్నలతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

◆ **పీసీసీ చీఫ్‌ను కలిసిన చంద్రశేఖర్**

జహీరాబాద్ టౌన్: పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి చంద్రశేఖర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేష్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మాదిగలంతా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని, వర్గీకరణలో మాదిగలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ అమలుకు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు దేవని సతీష్, మేరి తదితరులు ఉన్నారు.

◆ **హనుమాన్ చాలీసా పారాయణం**

సంగారెడ్డి : చౌటకూర్ మండలం కోర్పోల్ గ్రామంలో 18వ వారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ ప్రభుకుమార్ గౌడ్, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **హర్షణీయం**

పటాన్‌చెరు: ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ. ఐదు లక్షల ఉచిత ప్రమాద బీమా అందజేస్తామని చెప్పడం హర్షణీయమని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, గౌరవ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సలహాదారులు యాదగిరి, శేఖర్‌రావు పాల్గొన్నారు.

◆ **అష్టలక్ష్మి గణపతి**

జహీరాబాద్ టౌన్: పట్టణంలో సాయి గణేశ్ మండపం నిర్వాహకులు ప్రతిష్ఠించిన వినాయకుడిని తీరొక్కరీతిలో పూజలు చేస్తున్నారు. కాలనీ మహిళలు ఆదివారం వినాయకుడి ముందు అష్టలక్ష్మిల మూర్తులను ప్రతిష్ఠించి అలంకరించారు. అనంతరం కుంకుమార్చనతో ఘనంగా పూజలు నిర్వహించారు.

◆ **బ్రహ్మోత్సవాల్లో హరినామ సప్తహం**

నారాయణఖేడ్: మండలంలోని సంజీవన్‌రావుపేటలో లక్ష్మీ అనంత పద్మనాభస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా అఖండ హరినామ సప్తహం చేశారు. హరిభక్త పారాయణులు అవధూత మహారాజ్ గాథ పారాయణం, గాథ కీర్తన, భజనలు నిర్వహించారు.

అన్నప్రసాద వితరణ

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామంలోని ముదిరాజ్ సంఘం వద్ద ఏకదంత యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశ్ మండపం వద్ద అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

◆ **తప్పిపోయిన వ్యక్తిని కుటుంబానికి అప్పగింత**

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్‌లో గుర్తు తెలియని 40 ఏళ్ల వ్యక్తి వారం రోజులుగా సంచరిస్తున్నాడు. ఆదివారం అతన్ని గ్రామస్తులు ఆరాతీయగా.. తన పేరు యాదుల్ అని చెపారు. వారు ఖేడ్ ముస్లిం సంక్షేమ సంఘం బాధ్యులకు సమాచారం ఇవ్వడంతో, వారు అక్కడకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన గ్రామం ఆందోల్ మండలం అన్నాసాగర్ అని, తన తండ్రి పేరు హనీఫ్ అని తెలిపాడు. సంఘం బాధ్యులు పోలీసుల సహకారంతో అతడికి వైద్యం చేయించి అన్నాసాగర్‌లో అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

◆ **ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలి**

పటాన్‌చెరు: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భారతీనగర్, రామచంద్రపురం, అమీన్‌పూర్ మున్సిపాలిటీ, పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన వివిధ వినాయక మండపాలను ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా బందోబస్తు



సూచనలు చేస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: వినాయక నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. స్థానిక స్టేడియంలో ఆదివారం పోలీసులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న గణేశ్ నిమజ్జనం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో బందో బస్తు ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, ఎస్‌ఐ కాశీనాథ్‌లు ఉన్నారు.